క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మద్దూరు: మండలంలోని పెదిరిపాడ్‌లో సీపీఎం, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేసినట్లు డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు మహమ్మద్‌అలీ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, భరత్, శ్రీనివాసులు, వెంకట్, సుక్కప్ప, బాలప్ప, కనకప్ప, అంజి, నరేశ్ పాల్గొన్నారు.

గ్రూప్‌-1 ర్యాంకర్‌కు సన్మానం



నారాయణపేట/నారాయణపేట రూరల్/నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ శ్రీనివాసులు కూతురు వీణ గ్రూప్‌–1లో 118వ ర్యాంక్ సాధించడం అభినందనీయమని డిపో మేనేజర్ లావణ్య అన్నారు. శుక్రవారం ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో డిపో అధికారులు నరేందర్, పీఎస్ఎన్ రెడ్డి, వహీద్, రవికుమార్, ఆంజనేయులు, ఎంఎం రెడ్డి పాల్గొన్నారు. అదే విధంగా తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళా భవన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాతపల్లి నర్సింహ్మ, ప్రధాన కార్యదర్శి గోపాల్, రామకృష్ణ, రవి, అశోక్, రమేష్, బస్సప్ప పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ ఉమా మనోహర్‌గౌడ్ వీణను అభినందించి ఘనంగా సన్మానించారు.

ఎన్నారై అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా దేవేందర్

మరికల్: ప్రవాస భారతీయుల సంక్షేమ కోసం ప్రభుత్వం నియమించిన ఎన్నారై అడ్వైజరీ కమిటీలో మరికల్ మండలం జిన్నారం గ్రామానికి చెందిన నంగి దేవేందర్‌రెడ్డికి స్థానం అభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. గల్ఫ్, ఇతర దేశాలపై అనుభవం ఉన్న దేవేందర్‌రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ్యుడిగా నియమించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

గురుకులాలకు విద్యార్థుల ఎంపిక

నర్వ/మాగనూర్: నర్వ మండలంలోని పాథర్చేడ్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభకనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించినట్లు హెచ్‌ఎం నరేష్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల ఎంపికకు కృషిచేసిన ఉపాధ్యాయులు రఘువర్మ, స్వాతి, విష్ణు, తస్లీంలను గ్రామస్తులు అభినందించారు.

■ మాగనూర్ మండలంలోని పుంజనూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థి స్వేచ్ఛ గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నరేష్‌గౌడ్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాగనూర్: మండలంలోని నేరడగం గ్రామానికి చెందిన కాళప్ప తన ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా.. పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అశోక్ బాబు తెలిపారు. హోంగార్డు తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

న్యూట్రీషన్ కిట్ల పంపిణీ



ఆత్మకూర్: నాట్కో ఫార్మా లిమిటెడ్, నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషన్ కిట్లు అందజేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని 59 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు కిట్లు, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు మదన్‌మోహన్, ఫయాజ్ ఆహ్మద్, సీహెచ్‌ఓ సురేష్‌కుమార్, విద్యాసాగర్, సురేందర్‌గౌడ్, టీబీ సూపర్‌వైజర్లు ధర్మ, రాంచందర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 42 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను జిల్లా ప్రోగ్రాం అధికారి సాయినాథ్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పరిమళ, డా. భవాని, సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



రైతు, కార్మిక సంఘం ఆధ్వర్యంలో..



జాజాపూర్ ఉన్నత పాఠశాలలో..

పూలే ఆశయాలు కొనసాగిద్దాం



మక్తల్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

సాక్షి నెట్‌వర్క్: సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు కొనసాగించాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మక్తల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా అంబేడ్కర్ మండల కమిటీ, యువజన కమిటీ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాములు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, వైస్‌చైర్మన్ గణేశ్ కుమార్, శంషొద్దీన్, నూరుద్దీన్, వెంకటయ్య, వెంకటేశ్, మద్దిలేటి, తాయప్ప పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవీందర్ రెడ్డి, రాజిరెడ్డి, ఎరుకలి వెంకటయ్య, రవి కిరణ్, వినయ్, ఆనంద్, శశికిరణ్ పాల్గొన్నారు.

■ జ్యోతిరావు పూలే జీవితం కార్మిక వర్గానికి ఆదర్శనీయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్, క్షేత్ర సహాయకుల యూనియన్ నేత బీ.కాశీనాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నర్వ వెంకటేశ్, బాలస్వామి, అంజి అశోక్, భీంశప్ప, నగేశ్, మహేశ్, డి.కష్టయ్య, కనకప్ప, శ్రీశైలం పాల్గొన్నారు.

■ నారాయణపేట మండలంలోని జాజాపూర్, కొల్లంపల్లి, కోటకొండ, బొమ్మన్‌పాడు పాఠశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

■ ధన్వాడ మండల కేంద్రంలో పూలే విద్యాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాఘవేందర్ నాయుడు, ఎంఈఓ గాయత్రి, ఎమ్మెల్యే వ్యక్తిగత పీఏ మాధవరెడ్డి, నర్సింహులు నాయుడు, బాలరాజు పాల్గొన్నారు.



■ కోస్గి మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ వేణుగోపాల్, ఎమ్మార్పీఎస్ నాయకులు రాములు, బస్వరాజ్, నర్సింహులు తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ కృష్ణా మండలంలోని హిందూపూర్, ముడుమాల్ గ్రామాల్లో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీఎంఓ రాజేంద్రకుమార్, అంబేడ్కర్ సంఘం నాయకుడు అనిల్, ఎంఈఓ నిజాముద్దీన్, పీఆర్‌టీయూ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

■ ఊట్కూరులోని అంబేడ్కర్ చౌరస్తాలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. నాయకులు దుర్గం శ్రీనివాస్, హాజమ్మ, భరత్, రాజుకుమార్, గౌతమ్, యఘ్నేశ్వర్‌రెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

■ నర్వ బీసీ సంఘం భవనంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో బీసీ సంఘం మండల అధ్యక్షుడు సుధీర్, వెంకటేశ్వర్‌రావు, వెంకటయ్య, గడ్డం నర్సింహులు, శరణప్ప, అయ్యన్న, ఫజల్, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

■ మాగనూర్ మండలంలోని మందిపల్లి పాఠశాలలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిమ్మన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ మద్దూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించి పూలే జయంతి వేడుకల్లో ప్రిన్సిపాల్ నారాయణగౌడ్, అధ్యాపకులు జనార్దన్, నసీర్, బాలరాజ్, అఖిలేంద్ర, నవీన్, సత్యమ్మ, మణెమ్మ, గ్రీష్మ, సవిత పాల్గొన్నారు.



మద్దూరు డిగ్రీ కళాశాలలో..



ధన్వాడలో..



ముడుమాల్ ఉన్నత పాఠశాలలో..

కేంద్ర పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి



లింగంపల్లిలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న బీజేపీ నాయకులు

మక్తల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతోందని పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కర్నిస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని లింగంపల్లి, మాద్వార్ గ్రామాల్లో మేరా గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పేదల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోదీ అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాయకులు బాల్‌రాంరెడ్డి, నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, డా.శ్రీనివాస్ రెడ్డి, నరేశ్, సత్యనారాయణ, లక్ష్మణ్, నాగరాజు, శ్రీను, మంజుల, ఆనంద్, దత్తు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కనుమరుగు కావడం ఖాయం



మాట్లాడుతున్న సలీం

నారాయణపేట: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ సలీం అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో అయన విలేకర్లతో మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రాన్ని ఆగమాగం చేశారన్నారు. ప్రజలు ఆ పార్టీని నమ్మే పరిస్థితులో లేరన్నారు. మాజీ ఎమ్మెల్యేకు తన సొంత పనులపై ఉన్న శ్రద్ధ.. నియోజకవర్గనికి సాగునీరు తీసుకు రావడంపై లేకపోయిందన్నారు. జీఓ 69కు వ్యతిరేకం కాదంటున్నా మాజీ ఎమ్మెల్యే.. తమ ప్రభుత్వంలో ఎందుకు పేట–కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ తీసుకురాలేదని ప్రశ్నించారు. 2014లో పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కోయిల్‌కొండ మండలంలో రిజర్వాయర్ కట్టడానికి అప్పటి ప్రభుత్వం పూనుకుంటే తన బినామీ భూములు పోతాయనే భయంతో రిజర్వాయర్ కడితే ఆత్మహత్య చేసుకుంటానని బ్లాక్ మెయిల్ చేసింది మాజీ ఎమ్మెల్యే కాదా అని ప్రశ్నిచారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి నియోజకవర్గ రైతాంగానికి సాగునీటి కోసం ఎత్తిపోతల పథకం మంజూరు చేయించడమే కాకుండా నిర్మాణ పనులు మొదలుపెట్టడంతో తనకు శాశ్వత రాజకీయ సన్యాసం తప్పదని భావించి.. నియోజకవర్గంలోని అమాయక రైతులను రెచ్చగొట్టి ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకునేందుకు కుట్రలు చేయడం దారుణమన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ.. సమస్యలు పరిష్కరించడంతో పాటు అందరికీ విద్య, వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఒక్క ఏడాదిలోనే రూ. వెయ్యి కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేయించినట్లు వివరించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి శస్త్రచికిత్సలు



కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారితో కాంగ్రెస్ పార్టీ నాయకులు

మాగనూర్: లయన్స్ క్లబ్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సేవాసమితి ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 130 మందికి కంటి పరీక్షలు నిర్వహించి.. 52 మందికి కంటిశుక్లాల సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వీరిని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించి.. శుక్రవారం శస్త్రచికిత్సలు చేయించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తెలిపారు. శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి పండ్లు, బ్రెడ్లు , మందులు, కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దండు ఆనంద్, గడ్డం నరేష్, చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలి



ఊట్కూరు: ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని బిజ్వార్‌లో శుక్రవారం గ్యాస్ సిలిండర్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు జి.సావిత్రమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి పేదలపై పెనుభారం మోపుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివలీల, పద్మ, లింగమ్మ, నిర్మల పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలి



దామరగిద్ద: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పండించిన పంటకు మద్దతు ధరల చట్టం తీసుకురావాలని అఖిల భారత రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ డిమాండ్ చేశారు. అఖిలభారత కిసాన్ సభ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని ముస్తాపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు చట్టం చేస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం.. రైతు వ్యతిరేక విధానాలను అవలంబించడం తగదన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల ధరలను తగ్గించి.. రైతుకు కనీస మద్దతు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాలప్ప, గోవింద్, సిద్ధప్ప, రాజు, భీంసేన్, సాయి, చందు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహ విగ్రహాల పునఃప్రతిష్ఠాపన



ఉజ్జెల్లిలో ఎల్లమ్మ బండారోత్సవంలో పాల్గొన్న భక్తులు

మక్తల్: మండలంలోని భగువాన్‌పల్లిలో శుక్రవారం నవగ్రహ విగ్రహాల పునఃప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రోచ్చారణల మధ్య నవగ్రహ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, గణేశ్ కుమార్, రవికుమార్ చంద్రకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ బండారు ఉత్సవం..

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లి గ్రామంలో ఎల్లమ్మ బండారు మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బండారు చల్లుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

ఘనంగా చింతలరాయస్వామి జాతర..

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారంలో వెలిసిన స్వయంభూ చింతలరాయస్వామి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఆలయ అర్చకులు వెంకోబాచారి ఇంటి నుంచి స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా మహిళలు నీళ్లు పోస్తూ స్వామివారికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, హారతి తదితర పూజలు చేశారు. రాత్రి స్వామివారి ప్రభోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అనంతరామ్, సుదర్శన్‌రెడ్డి, హన్మంతు, చంద్రకాంత్, కృష్ణయ్య, నర్సింహులు, సిద్రామప్ప పాల్గొన్నారు.



సింగారంలో చింతలరాయ స్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం



భూత్పూర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మక్తల్: పేదల కడుపు నింపేందుకే ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తోందని మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గణేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గడ్డంపల్లి, భూత్పూర్ గ్రామాల్లో రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసి పథకాలను అమలు చేస్తోందన్నారు. రేషన్ దుకాణాల్లో ఇస్తున్న సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు సతీశ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ కట్ట సురేశ్, రవికుమార్ పాల్గొన్నారు.

బాలికలను వేధింపులకు గురిచేస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

కోస్గి రూరల్: బాలికలు, మహిళలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని షీటీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య హెచ్చరించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని ఎస్ఆర్‌పీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినులను ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, బ్లాక్‌మెయిల్, సోషల్ మీడియాలో కామెంట్స్ వంటివి చేస్తే సహించేది లేదన్నారు. ఎవరైనా విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తే ధైర్యంగా షీటీం పోలీసులను సంప్రదించాలని సూచించారు. మానవ అక్రమ రవాణా కట్టడి, బాల్యవివాహాల నివారణకు అందరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం పోలీసులు జ్యోతి, కవిత పాల్గొన్నారు.

ఎంప్లాయి నంబర్ కేటాయించాలని వినతి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న పీఆర్టీయూ నాయకులు

నారాయణపేట రూరల్: విద్యాశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిన నియామకమైన డీఎస్సీ–2008 ఉపాధ్యాయులకు ఎంప్లాయి నంబర్ కేటాయించాలని కోరుతూ పీఆర్టీయూ జిల్లా నాయకులు శుక్రవారం డీఈఓ గోవిందరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాద్గీర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. చివరి క్షణంలో ఉద్యోగాలను కోల్పోయి దాదాపు 17ఏళ్ల తర్వాత వారి కలను నెరవేర్చుకోగలిగారని అన్నారు. వారు నియామక పత్రాలు అందుకుని రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు ఎంప్లాయి నంబర్ కేటాయించక పోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు. వెంటనే వారికి గుర్తింపు సంఖ్య కేటాయించి వేతనాలు అందే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రఘువీర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు రవి ప్రకాష్, కర్ణ ప్రసాద్, రఘునాథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌సేఫ్టీ కమిటీలు పర్యవేక్షించాలి



జంగంరెడ్డిపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లారెడ్డి

నర్వ: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును ఎప్పటికప్పుడు ఫుడ్‌సేఫ్టీ కమిటీలు పర్యవేక్షించాలని తహసీల్దార్ మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జంగంరెడ్డి పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి.. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులతో ఆరా తీశారు. వంట ఏజెన్సీలు శుభ్రత పాటించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. పాఠశాలకు విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్‌ఐ మల్లేష్, హెచ్‌ఎం ఉస్మాన్ ఉన్నారు.

సకాలంలో బస్సులు లేక అవస్థలు

నారాయణపేట రూరల్: జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. అయితే ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో బస్సులు సరైన వేళకు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకే బస్సు రెండు వేర్వేరు రూట్లలో విద్యార్థులను జిల్లా కేంద్రానికి తరలించే విధంగా సమయపాలన రూపొందించడంతో డ్రైవర్లకు కత్తిమీద సాములా మారింది. దామరగిద్ద మండలం కంసాన్‌పల్లి గ్రామం నుంచి ఆ రూట్‌లోని వివిధ గ్రామాల విద్యార్థులను నారాయణపేటకు తీసుకువచ్చే బస్సు తిరిగి ఉట్కూరు మండలంలోని ఆమీన్‌పూర్ రూట్‌లోని గ్రామ విద్యార్థులను సైతం జిల్లా కేంద్రానికి తరలించాల్సి ఉంది. ఈ క్రమంలో ఉదయం 9:30 గంటల తర్వాత విద్యార్థులు పాఠశాలకు చేరుకుని పరిస్థితి నెలకొంది. దీంతో రోజు విద్యార్థులు పరీక్ష సమయానికి ఆలస్యంగా వెళ్తున్నారు. ఎన్నిసార్లు డిపో అధికారులకు విద్యార్థి సంఘాలు మొరపెట్టుకున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు వాపోతున్నారు. సకాలంలో పరీక్షకు హాజరుకాని విద్యార్థులు మానసిక ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న డిపో అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.